www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 మే 2024

5

తిరుపతి

14 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా పిఒ, ఎపిఒ, పోలింగ్ సిబ్బందికి ఇచ్చిన రెండవ దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 14 మందికి షోకాజ్ నోటీసులను కలెక్టర్ జారీ చేశారు. అందులో వారు సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేనందున ఐదుగురిని సస్పెండ్ చేశారు. పోలింగ్ విధులకు గైర్హాజరైన 272 మందికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లుగా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ అనేది ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప బాధ్యతతో కూడిన కర్తవ్యమని, ఉద్యోగులు తమకు కేటాయించబడిన ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు.

అడ్మిషన్ల 'దందా'

అడ్వాన్స్ బుకింగ్ అంటూ పిఆర్‌ఒల హడావిడి
అదేదారిలో ప్రయివేటు పాఠశాలల కాన్వాసింగ్
కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి

" మేడం...! భార్గవ్ .. మీ అబ్బాయేగా. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసయ్యాడు. అందుకే వెతుక్కుంటూ మీ ఇంటికి వచ్చాం. ఇంటర్‌లో మంచి కళాశాలలో చేర్పిస్తేనే మీ అబ్బాయి భవిష్యత్తు బాగుంటుంది. మా కళాశాలలో కొంచెం ఫీజు ఎక్కువైనా నాణ్యమైన విద్యను అందిస్తాం. ఇంటర్‌తో పాటే ఎంసెట్‌కు ప్రత్యేక తర్ఫీదును ఇస్తాం. అంతే కాదు ఐసి, ఎసి బ్యాచ్‌లనూ రన్ చేస్తున్నాం. రెండు దశాబ్దాలుగా రాష్ట్ర స్థాయి ర్యాంకులన్నీ మావే. ఒకవేళ ఈ ప్రభుత్వమూ ర్యాంకులను ప్రకటించి ఉంటే అత్యుత్తమ ర్యాంకులన్నీ మావే. ఇదిగో మా కళాశాల ప్రత్యేకతలతో కూడిన బ్రోచర్‌ను చూడండి. మాకున్న పేరు రాష్ట్రంలో ఏ విద్యాసంస్థకూ లేదు. సాధారణ విద్యార్థులను సైతం స్టేట్ ర్యాంకర్‌లుగా తీర్చిదిద్దిన ఘనత మా కళాశాలదే. ఇప్పుడు మీరు తొందరపడకుంటే మళ్లీ మా కళాశాలలో సీటు దొరకడం అంత సులభం కాదు. పైగా ఇప్పుడే అడ్వాన్స్ బుకింగ్ (రిజిస్ట్రేషన్) చేసుకుంటే మీకు ప్రత్యేక రాయితీ ఇస్తాము. ప్రస్తుతానికి రూ. 2 వేలివ్వండి. మిగిలింది పిల్లాడిని చేర్పించేటప్పుడు చెల్లిస్తే చాలు. ఇదిగో దరఖాస్తు ఫారం. వీటిని నింపి సంతకం పెట్టండి "

- ఇదీ తిరుపతిలో ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాల పిఆర్‌ఓల హడావుడి

" సార్..!. మీ ఇంట్లో బడి ఈడు పిల్లలున్నారా... ఉంటే మా పాఠశాలలోనే చేర్పించండి. ఎల్‌కెజీ నుంచీ 10 తరగతి వరకూ మా పాఠశాల పిల్లలందరూ ఇంగ్లీషులోనే మాట్లాడేలా మేం తయారు చేస్తాం. మా పాఠశాలలో ఒకటో తరగతి నుంచే కంప్యూటర్ చదువులు చెప్పిస్తాం. ఇంగ్లీషులోనే గడగడా మాట్లాడించేస్తాం. మిగతా బడుల్లో ఉన్న అయ్యోర్లకంటే 10 రెట్లు బాగా చదువు చెప్పే టీచర్లు మా పాఠశాలలో ఉన్నారు. ఐదంతస్తుల పెద్ద భవనంలో స్కూల్‌ను ఏర్పాటు చేశాం. రానుపోను బస్సు సౌకర్యం ఉంది. ప్రత్యేకంగా కంప్యూటర్లు, ల్యాబ్, ప్లేగ్రౌండ్ ఉన్నాయి. తెల్లారి 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. పదో తరగతికి అయితే స్పెషల్ క్లాసులు, స్టడీ అవర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణతో పాటు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ఈ కారణంగానే మా పాఠశాల విద్యార్థులు ప్రతిఏటా అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారు. నర్సరీ నుంచి 10 తరగతి వరకు మా పాఠశాలదే అన్నింటా అగ్రస్థానం. మీకు మీ పిల్లల భవిష్యత్తే ముఖ్యమని భావిస్తే, కొంత ఎక్కువ ఖర్చయినా ..వారి బాధ్యత మాకు అప్పగించండి"

- ఇదీ మంగళంలో ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం కాన్వాసింగ్

వేసవి సెలవులు ఇంకా ముగియనే లేదు. ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల్ని, వారి తల్లితండ్రుల్ని తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థుల తల్లితండ్రుల వెంటపడుతూ వారికి గాలం వేసేందుకు సిద్ధమవుతున్నారు. పిఆర్‌ఓలను నియమించుకుని ఇంటింటికీ తిప్పుతూ తమ కళాశాలల్లో ఉన్నవీ లేనివీ అన్నింటినీ కలిపి విస్తృత ప్రచారం చేస్తున్నారు. రంగురంగుల బ్రోచర్స్ తో విద్యార్థుల తల్లిదండ్రుల్ని మభ్యపెడుతున్నారు. అడ్వాన్స్ బుకింగ్ అంటూ ఇంటర్‌లో అడ్మిషన్లను చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పెద్దఎత్తున కమీషన్‌లు ఇచ్చి వారి ద్వారానే విద్యార్థుల తల్లితండ్రులకు ' పలానా కళాశాలలో చదువు బాగా చెబుతారు. మేము మీకు రెకమండ్ చేస్తాం. ఫీజుకూడా తగ్గించేలా చూస్తాము ' అని చెప్పించి , తద్వారానూ అడ్మిషన్లను చేస్తున్నారు. వీరి మాటలు నమ్మి ఆ కళాశాలలో చేరిన తర్వాత గానీ పిఆర్‌ఓలు తొలుతగా చెప్పిన ఫీజుకు, ఆయా కళాశాలలు వసూలు చేస్తున్న ఫీజులకు ఏమాత్రం సంబంధంలేదన్న విషయం తెలియడం లేదు. ఇక చేసేది లేక విద్యార్థుల తల్లితండ్రులూ కార్పొరేట్ కళాశాల అడిగినంతా ఇవ్వకతప్పడం లేదని వాపోతున్నారు. పాఠశాలల స్థాయిల్లోనూ ప్రయివేటు యాజమాన్యాలు పోటీలు పడి మరీ ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్ని తమ వైపుకు తిప్పుకునేందుకు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తున్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి : రవి, ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా

పదో తరగతి పరీక్షలు ముగియకుండానే కొన్ని ప్రైవేటు కార్పొరేట్ యాజమాన్యాలు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తూ వచ్చింది. ఇప్పుడేమో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. ప్రైవేటు స్కూళ్లలోనూ టీచర్లకు టార్గెట్‌లను ఇచ్చి మరీ అడ్మిషన్లను చేస్తున్నారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధమని అటు డిఇఒ, అటు ఆర్‌ఐఒలకూ తెలుసు. ఇలాంటి విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు రాతపూర్వకంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలేమో బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోకుంటే విద్యాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు తీవ్రతరం చేస్తాం. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఒకటికి రెండు సార్లు ఆలోచించి విద్యార్థులను కళాశాలలో చేర్పించాలి. కార్పొరేట్ యాజమాన్యాలు పెట్టే మార్కుల ప్రలోభాలకు లొంగకుండా వాస్తవంగా ఆలోచించి, మంచి కళాశాల, పాఠశాలల్లో చేర్పించాలి.

ఈవిఎం కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

పోల్డ్ ఈవిఎంలు భద్రపరచిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లను, కౌంటింగ్ ఏర్పాట్లను తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించి కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం స్ట్రాంగ్ రూంల భద్రతను పరిశీలించి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఆరు నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాలు, తిరుపతి పార్లమెంటరీ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను, మెష్, బ్యారికేడింగ్ సీటింగ్ తదితర అంశాలపై డిఆర్‌ఓతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా జనరేటర్ తగు సామర్థ్యం ఉండేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూం నందు ఈవిఎం లను పరిశీలించారు. సందర్శకుల రిజిష్టర్ నందు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, అదనపు ఎస్పీ ఎ.ఆర్ శ్రీనివాస రావు, శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి రవి శంకర్ రెడ్డి, సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం : ఎస్పి

జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులతో శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు వచ్చినప్పుడు స్పెషల్ పార్టీ పోలీసులు ముఖ్యంగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. గతంలో ఎస్‌టీఎఫ్ సిబ్బంది ఎలాంటి రిమార్క్స్ లేకుండా అందరూ ఎస్పీల దగ్గర పని చేశారని, ఇదే స్ఫూర్తితో రానున్న ఈ పది రోజులు ఎంతో కీలకమని, అందరూ మంచిగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్‌టిఎఫ్‌లో మీరేం చేసినా దాని ప్రభావం జిల్లా పోలీసుల పై ఉంటుందన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు, మీరు చాలా స్పీడ్‌గా వెళ్లాల్సి ఉంటుందని, దానికి తగ్గట్టుగా సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పిలు రవీంద్రారెడ్డి, రమణయ్య, ఆర్‌ఐలు హరికష్ణ, రమణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

పదకవితా పితామహుడు అన్నమయ్య

ప్రజాశక్తి - క్యాంపస్

అచ్చ తెలుగు పదాలతో కీర్తనలు రచించి సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అన్నమయ్య పద కవితా పితామహుడిగా నిలిచారని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రామ సూర్యనారాయణ పేర్కొన్నారు. తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన డా. రామ సూర్యనారాయణ "తాళ్లపాక కవులు - పద కవిత్వం" అనే అంశంపై ఉపన్యసిస్తూ, అన్నమయ్య పద కవిత పితామహుని తెలిపారు. వంశమంతా కవులైన ఖ్యాతి తాళ్లపాక వంశానికి చెందుతుందన్నారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మలయ వాసిని ' అన్నమయ్య కీర్తనలు - వస్తు వైవిధ్యం ' అనే అంశంపై ప్రసంగిస్తూ, అన్నమయ్య మధుర భక్తితో వస్త్రాశ్రయ సాహిత్యం, ఆత్మాశ్రయ సాహిత్యం అనే రెండు అంశాలతో తన సంకీర్తనలను రచించినట్లు చెప్పారు. వరంగల్లు కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కాత్యాయని విద్మహే 'అన్నమయ్య పద కవితలు - లౌకిక విలువలు' అనే అంశంపై మాట్లాడుతూ, లౌకిక జీవితం లేకుండా భక్తి లేదని, సమాజంలో, వ్యక్తిగతంగా వున్న సమస్యల పట్ల ఆందోళన చెందుతున్న సందర్భంలో భక్తులు అవుతారన్నారు. అన్నమయ్య ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ఆకలి, కష్టాలు భగవంతుడిని గుర్తు చేస్తాయని తన కీర్తనల ద్వారా తెలిపారన్నారు. అన్నమయ్య తన కీర్తనల ద్వారా ప్రజలు జీవితంలో అక్రమ సంపాదన ఉండకూడదని, కొద్దిగా ఆయన గౌరవప్రదమైన సంపాదన ఉండాలని, ఇతరులను నిందించకూడదని, హాని చేయకూడదని, కోపము వంటి దుర్గుణాలను వదులుకోవాలని, అవసరం ఉన్నవారికి సహాయం చేయాలని తెలిపినట్లు చెప్పారు. భక్తి ఉద్యమంలో స్త్రీలు, పురుషులు సమానమని, సామాజిక అసమానతలు ఉండవని తన కీర్తనల ద్వారా భక్తి మార్గాన్ని ప్రబోధించినట్లు వివరించారు. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మధుసూదన్ రావు బృందం గాత్ర సంగీత కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు చెన్నై కి చెందిన ప్రియా సిస్టర్స్ బృందం సంగీత సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పెండింగులో వున్న సోలార్ ప్లాంట్ పనులపై అలసత్వం వద్దని, పనుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఏఎస్ తెలిపారు. తూకివాకం వద్ద నున్న 6 మెగా వాట్స్ గ్రౌండ్ మౌంట్ సోలార్ ప్రాజెక్ట్ పనులను, అదే విధంగా వినాయకసాగర్ వద్ద గల 5 ఎం.ఎల్.డి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం కమిషనర్ అదితి సింగ్ ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్ట్ పనుల అలసత్వంపై కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. వినాయకసాగర్ వద్దనున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి, మరికొన్ని పనులు పెండింగులో వున్న విషయాన్ని ప్రస్థావిస్తూ పూర్తిస్థాయిలో కేంద్రాన్ని ప్రయోజనంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ వెంట మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ధర అదిరె... జనం బెదిరె..!

- కూరగాయల ఉత్పత్తి తగ్గి..
- కిలో రూ.60-100 పైనే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎండాకాలం...మండేకాలం.. దీంతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది.. ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు ఉట్టెక్కాయి. టమోటా కిలో రూ.50-60 ధర పలుకుతుంటే, బీన్స్ కిలో 100-120 పైకి ఎగబాగింది. మరో నెలరోజుల పాటు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతుండటం గమనార్హం. దీంతో జనం కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు ప్రతిరోజూ 15 నుంచి 20వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు వస్తుంటాయి. ప్రస్తుతం 50 శాతం కూడా సరఫరా కావడం లేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురిస్తే గాని సాధారణ పరిస్థితులు నెలకొనవని, ఎండలు ఎక్కువగా ఉండడంతో, సాగునీరు లేక రైతులు కూరగాయలు పండించడం లేదని తెలిపారు. దీంతో తిరుపతి జిల్లా అవసరాలకు కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. జూన్ చివరి వరకూ ఇదే పరిస్థితి నెలకొననుంది.

తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి టమాటా, బీన్స్, క్యాప్సికం సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కొన్ని రోజుల క్రితం వరకు చిత్తూరు, ఒంగోలు జిల్లాల నుంచి వచ్చేవి. తమిళనాడు, కర్ణాటక లోని కొన్ని జిల్లాల నుంచి నుంచి రోజూ 40 నుంచి 50 లారీల టమాటా దిగుమతి కాగా, ప్రస్తుతం 10 లారీలు మించడం లేదు. దీంతో బెంగళూరు, బెల్గాం, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి నగరానికి రోజుకు 30 నుంచి 35 లారీల టమాటా దిగుమతి చేస్తున్నారు. బీన్స్ నెల రోజులు క్రితం రోజుకు 2 నుంచి 4 టన్నులు దిగుమతి కాగా, ప్రస్తుతం టన్నుకు మించి రావడం లేదు. దీంతో వీటి ధరలు విపరీతంగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. చిక్కుడుకాయ కూడా మార్కెట్లో కనిపించడం లేదు. ప్రస్తుత ఆఫ్ సీజన్లో స్థానికంగా కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండవు. దీంతో కమీషన్ ఏజెంట్లు ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్కు కూరగాయలు తెప్పిస్తారు. దీంతో వారు నిర్ణయించిన ధరలకే కొనాల్సి వస్తోంది.

సాగు లేకే అధిక ధరలు : కె.శ్రీధర్, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, గుడిమల్కాపూర్ మార్కెట్

ఏప్రిల్ నుంచి నగర శివారు జిల్లాల నుంచి కూరగాయల దిగుమతి తగ్గిపోయింది. మే నెలలో డిమాండ్ ఉన్నా సరఫరా 30 శాతం మించదు. సాధారణంగా వేసవిలో ఎండలు కారణంగా తోటలకు నీరు అందదు. దీంతో కూరగాయల సాగు అంతగా ఉండదు. నగర కూరగాయల అవసరాలు తీర్చడానికి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేస్తున్నాం. టమాటా ధరలను నియంత్రించడానికి ఢిల్లీ నుంచి దిగుమతి చేసేందుకు ప్రణాళిక చేశాం.

రోజుకు రూ.150పైనే ఖర్చు : లక్ష్మమ్మ, తిరుపతి

కుటుంబంలో నలుగురు ఉంటే రోజుకు రూ.150పైనే ఖర్చవుతోంది. ప్రస్తుతం బీపీ, సుగర్ పెరిగిపోవడంతో డాక్టర్లు అన్నం తక్కువగా తిని, కూరలు ఎక్కువగా తినమని చెబుతున్నారు. ఆ విధంగా అలవాటు పడిన ప్రాణాలు, ప్రస్తుతం తగ్గించి తినాలంటే తినలేం. దీంతో ఎంత రేటు ఉన్నా కూరగాయలు కొనక తప్పదు, వండక తప్పదు, తినక తప్పదు. జిల్లాలోనే వేసవిలో కూరగాయల సాగుకు అధికారులు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తే ఈ పరిస్థితి ఉండదు.

కూరగాయలు	కిలో ధర
బీన్స్	రూ.150
పచ్చిమిర్చి	రూ.100
పెద్ద చిక్కుళ్లు	రూ.100
క్యారెట్	రూ.100
దొండ	రూ.60
బంగాళదుంప	రూ.50
బెండ	రూ.60
టమోటా	రూ.35

డాక్టర్ టి.జనార్ధన్‌కు రామకృష్ణ అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న విశాలాంధ్ర మాజీ బ్యూరో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా మాజీ అధ్యక్షులు టి.జనార్ధన్‌ను అభినందిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అభినందనలు తెలిపారు. శుక్రవారం తిరుపతి సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం అనంతరం జనార్ధన్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. జర్నలిజం చేస్తూనే పార్టీలో వివిధ బాధ్యతల్లో పనిచేస్తూ పిహెచ్‌డి పూర్తిచేసి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, నదియా పాల్గొన్నారు

ఇంటర్ సప్లిమెంటరీకి 591 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలలో జిల్లావ్యాప్తంగా 591 మంది విద్యార్థులు పరీక్షలకు గైరహాజరయ్యారని ఆర్ ఐ ఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 983 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలకు 872 మంది హాజరయ్యారని, 111 మంది గైరహాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 7220 మంది దరఖాస్తు చేసుకోగా 6,740 మంది హాజరయ్యారని, 480 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

'హోలీ గ్రీన్'లో చదువుల సంచలనం



ప్రజాశక్తి-తిరుపతి సిటి

'లెర్న్ టుడే... లీడ్ తుమారో... విజయాలకు కొదవలేదు... హోలీ గ్రీన్‌కు తిరుగులేదు' అనే నినాదంతో ముందుకెళ్లుతూ.. చదువుల్లో తమ అనుభవాలను రంగరించి, విద్యార్థులకు బోధిస్తూ అత్యుత్తమ ఫలితాలతో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంచలనం సృష్టిస్తోందని ఆ స్కూల్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ హరినాధ రెడ్డి తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సేవా దృక్పథం కల్గిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, నాణ్యతతో కూడిన బోధన విధానం అనుసరిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన సమగ్రమైన స్టడీ మెటీరియల్, దానికి అనుబంధంగా వర్క్‌షీట్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యపరంగా వెనకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, విద్యతో పాటు లలిత కళలలో అభిరుచిని పెంపొందించడానికి మ్యూజిక్, డ్యాన్స్ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థికి అదనపు సమాచారం అందించడం కోసం చక్కటి లైబ్రరీ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. మానసిక వికాసానికి, ప్రశాంతతకు యోగా తరగతులు నిర్వహించడం, విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయడానికి తరచుగా తల్లిదండ్రులు, టీచర్లతో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థి యొక్క విద్యా సమాచారం తెలియజేసేందుకు తల్లిదండ్రులకు మొబైల్ యాప్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, విశాలమైన ప్రాంతంలో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నెలకొల్పామన్నారు. 2024 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, డి.నైనాశ్రీలక్ష్మి 593/600, గీతిక 592, లక్ష్మిశ్రీవర్ధన్ 588, ఎస్.కల్యాన చక్రవరి చిద్విలాస్య 587 , ఆదర్శరెడ్డి 587, గణేష్ 582 , మహమ్మద్ అఫీబ్ 580 మార్కులతో స్కూల్ టాపర్లగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8333830044, 83338 30055 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు

- స్మార్ట్‌బోర్డు ద్వారా విద్యాబోధన.
- మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్‌కు సంబంధించిన ల్యాబ్ సౌకర్యం.

- ప్రతి తరగతికి కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే.
- కోలీగ్రాఫీ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ.
- ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహించడం.
- విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఐఐటి, జెఈఈ, నీట్, సివిల్స్‌కు ప్రత్యేక శిక్షణ.
- అటెండెన్స్, హోమ్‌వర్క్, మంత్‌లాగ్, ఎగ్జామ్ షెడ్యూల్, ప్రోగ్రస్, ఇతరత్రావి.
- అన్ని తరగతులు డిజిటలైజ్డ్.
- ఎడ్యుకేషన్, డిసిప్లేన్, వ్యాల్యూవ్స్, స్పోర్ట్, ఫైన్ ఆర్ట్స్.

బృందమ్మ కాలనీలో నాకా బందీ

నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ శివారులోని బృందమ్మ కాలనీలో శుక్రవారం వేకువ జామున పోలీసు లు నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా చట్ట వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడకూడదన్నారు. విజ యోత్సవ ర్యాలీల్లో పాల్గొనా కూడ దని సూచించారు. ఈ నాకా బందీలో డిఎస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి, సిఐలు నరసింహారావు, రారాజు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఏజిపి గ్యాస్ పైప్ లైన్‌పై తవ్వకాలు నిషేధం

ప్రజాశక్తి - ఓజిలి: మండల పరిధిలోని పెద్దపరియ జాతీయ రహదారి కూడలి వద్ద ఉన్న ఏజి అండ్ పి గ్యాస్ నుండి అత్తివరం, నాయుడుపేట రహదారుల మీదుగా గ్యాస్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై ఆకస్మికంగా ఎవరైనా గ్యాస్ పైప్ లైన్‌పై తవ్వకాలు చేపడుతున్నారని దీని ద్వారా గ్యాస్ లీక్ అయి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఏజిపి గ్యాస్ యాజమాన్యం హెచ్చరించింది. పైప్‌లైన్లపై జెసిబిలతో, ఇతర యంత్రాలతో తవ్వకాలు చేపట్టే ముందు ఏజిపి గ్యాస్ యాజమాన్యానికి ముందు టోల్ ఫ్రీ నెంబర్ 1800 2022 999 ,7200108123 నెంబర్లకు సమాచారం తెలపాలని పేర్కొన్నారు. సమాచారం తెలపకుండా గ్యాస్ పైప్ లైన్‌పై తవ్వకాలు, మరమ్మతులు చేపట్టినా అలాంటి వారిపై ఏజిపి యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

- మెగా బ్రదర్స్ సేవా సమితి సభ్యుల మానవత్వం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో రమణయ్య (85)అనే వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. ఈ క్రమంలో రమణయ్య అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందారు. అతనికి సంబంధించిన వారు ఎవరు లేకపోవడంతో వృద్ధాశ్రమ నిర్వాహకులు కళ్యాణి మెగాబ్రదర్స్ సేవాసమితి సభ్యులకు రమణయ్య మృతి విషయాన్ని తెలిపారు. దీంతో మెగాబ్రదర్స్ సేవాసమితి సభ్యులు, జనసైనికులు ఓంకార్, మోహన్, విజయ్, సనత్, వెంకటేష్, సుబ్బయ్యలు వృద్ధాశ్రమంకు చేరుకొని రమణయ్య మృతదేహానికి హిందూ సాంప్రదాయం ప్రకారం గూడూరు సాదుపేట సెంటర్లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

పెట్రోలు బంకులను తనిఖీ చేస్తున్న తహశీల్దారు శ్రీనివాసగౌడ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని పెట్రోల్ బంకులను పుత్తూరు తహశీల్దార్ శ్రీనివాస గౌడ నేతృత్వంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఉంచుకొని ఎలాంటి అవాంఛ నీయ సంఘ టన లు జరగకుండా ముంద స్తు జాగ్రత్తగా పెట్రోల్ బంకు వద్ద ఎవరికి గాని బాటిల్స్, క్యాన్ లో పెట్రోల్ ఇవ్వకూడదని పెట్రోల్ బంక్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. లూజ్ పెట్రోల్ అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కెవిఆర్ పురం గ్రామంలో 5 లీటర్ల పెట్రోలు, తిరుమలకుప్పం గ్రామంలో 9 లీటర్ల పెట్రోల్, రోడ్డు సైడ్ కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. ఈ తనిఖీలో వీఆర్‌ఓ దామోదరం పాల్గొన్నారు.

28 నుంచి అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నరసింహులు తెలిపారు. జూన్ 3, 4, పరీక్షలు నిర్వహించరని విద్యార్థులు గమనించాలన్నారు. మరిన్ని వివరాలకు 9515401088, 7382929641 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

-19మంది గైర్హాజరు

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 196 మంది విద్యార్థులకు పరీక్షలు హాజరు కావాల్సి ఉండగా అందులో 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల, ఏపీఆర్ జేసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష సెంటర్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 161 మందికి గాను 148 మంది, ద్వితీయ సంవత్సరంలో 35 మందికి 25 మంది హాజరయినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, సారాబాయ్ లు తెలిపారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీస్ మాక్ డ్రిల్ 'సక్సెస్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించే అల్లరి మూకలను చెదరగొట్టడం, నిలువరించడంలో భాగంగా శ్రీకాళహస్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద నిర్వహించిన పోలీసు మాక్ డ్రిల్ విజయవంతమైంది. శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసులు, 50 మంది ఉద్యోగులు అవగాహన పొందిన స్థానిక ప్రజలు మాక్ డ్రిల్లింగ్ లో పాల్గొన్నారు. వచ్చే నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాల నేపథ్యంలో పలుచోట్ల అల్లర్లు చెలరేగే అవకాశం ఉన్నందున వాటిని ఎలా నివారిస్తారో పోలీసులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడే మూకలపై మొదట టియర్ గ్యాస్ ప్రయోగం, ఆ పై లాఠీఛార్జీ, అప్పటికీ నియంత్రణలోకి రాకపోతే కాల్పులు ఎలా చేస్తారో భౌతిక కృత్యాల ద్వారా చేసి చూపించారు. అనంతరం డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, విజయోత్సవ ర్యాలీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు భద్రత ఏర్పాట్లను చేస్తోందని వివరించారు. ఇందులో భాగంగానే ప్రజలకు అర్థమయ్యేలా మాక్ డ్రిల్లింగ్ చేశామని తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్లర్లకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ నరసింహారావు, టూ టౌన్ సీఐ రారాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుగుబాటు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు ఆర్డబ్ల్యూఎస్ శాఖలో ఏఈగా పని చేస్తున్న సూర్యనారాయణ బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా జిల్లా ఉన్నతాధికాలాదేశాల మేరకు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం,సంక్షేమ పథకాలు, తాగునీటి సమస్యలు తదితర వంటి వాటిపై ఎంపీడీవో ఆధ్వర్యంలో ముఖ్యంగా ఆర్డబ్ల్యూఎస్,పంచాయతీరాజ్,పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష సమావేశం ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహిస్తూ ఉంటారు.అందులోనూ ప్రస్తుతం వేసవి తీవ్రతరం కావడంతో తాగునీటి సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది. ఇందులో భాగంగానే సమీక్ష సమావేశం నిర్వహించడానికి మండల పరిషత్ సిబ్బంది, పలుమార్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోయిందని ఈ క్రమంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది.ఏఈ సూర్యనారాయణ ఎంపీడీవో ఛాంబర్లోకి వెళ్లడంతో తాగునీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ చెప్పారు. దీంతో సత్యవేడు మండల విద్యాశాఖ అధికారి2 ఉష సాక్షిగా స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ పై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గెజిటెడ్ అధికారి, నువ్వు ఎవరు చెప్పడానికి? నీకు

బాధ్యతారాహిత్యంపై విమర్శల వెల్లువ

నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు?ఏదైనా సమాధానం తాను చెప్పాలనుకుంటే తమ శాఖకు సంబంధించిన డిఈ, ఈఈకి చెబుతాను..మీరు ఎవరికైనా చెప్పుకోండి, నన్ను ఏమి చేయలేరు...!' అంటూ ఊగిపోయారు.ఈ సంఘటన ఎంఈఓ టు ఉషాతో పాటు పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఏఈ దేవి ప్రసాద్, మధనంబేడు సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ భాను ప్రకాష్‌ల మధ్య చోటు చేసుకోవడం గమనార్హం. మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ తిరగబడడం బాధ్యత రాహిత్యాన్ని సూచిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ పరిస్థితి ఇలా ఉంటే మరి ప్రస్తుతం ఆర్డబ్ల్యూఎస్ డిఈ మురళీధర్ పరిస్థితి ఎలా ఉందో అన్న అనుమానాలు వ్యక్తం అవుతాయి. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ వేలకు వేలు జీతాలు తీసుకుంటూ ఇలా బాధ్యత రాహిత్యంగా వ్యవహ రించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతా ధికారులు దీనిపై స్పందించి మండల అధికారి ఎంపీడీవో పట్ల దురుసుగా వ్యవహరించిన ఏఈ సూర్యనారాయణపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డిఎస్‌పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి డిఎస్‌పి బి ఉమామహేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల తిరుపతి జిల్లాలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొన్నిచోట్ల అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న దృష్ట్యా ఓట్ల లెక్కింపు రోజు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలీసు పికెట్లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలు, క్యూఆర్‌టి బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రబుల్ మాంగర్లు, సంఘ విద్రోహ శక్తులను గుర్తించి, వారిపై ప్రత్యేకత నిఘా ఏర్పాటు చేయడమే కాకుండా వారి ప్రతి కదలికను గమనిస్తూ ఉంటామన్నారు. ఓట్ల లెక్కింపు రోజు విజయోత్సవ ర్యాలీలు, సభలు సమావేశాలకు అనుమతి నిషేధమని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్లర్లకు పాల్పడితే చట్టపర కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: నారాయణవనం మండల పరిధిలోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ని సిద్ధార్థ ఆడిటోరియంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేదికకు ముఖ్య అతిథిగా డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, చీఫ్ కోఆర్డినేటర్ ఏఐసిటిఇ , చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లను మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ హేమచంద్ర రెడ్డి, ఛైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, కళాశాల ఛైర్మన్ డాక్టర్ అశోక్ రాజు విచ్చేసి ప్రారంభించారు. కళాశాల మొత్తం 386 మంది తమ బిటెక్ కోర్సు పూర్తి చేసుకుని ముఖ్య అతిథుల చేతుల మీదుగా డిగ్రీలు అందుకున్నారు. వారిలో సివిల్ ఇంజనీరింగ్ సతీష్ కుమార్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సాయి శరణ్య, ఎలక్ట్రానిక్అండ్ కమ్యూనికేషన్ అనూష, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ నాగబ్రహ్మ నారాయణరెడ్డి గోల్డ్ మెడల్ సాధించారు. వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ అనుభవం, విలువలు, తదితర అంశాలలో విజ్ఞానాన్ని తద్వారా మీ విజ్ఞానాన్ని రాష్ట్ర దేశ అభివృద్ధికి మీ విజ్ఞానం తోడ్పడుతుందని తెలిపారు. డిగ్రీల ప్రదానోత్సవ ఉత్సవ కార్యక్రమానికి వచ్చిన మొత్తం 854 మందికి డిగ్రీ పట్టాలు అందించారు. గోల్డ్ మెడల్ సాధించిన వారికి మెడల్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. మొదట విద్యార్థులు తన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కారణం సిద్ధార్థ కళాశాలను ఎన్ను

గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా అతిథుల నుండి ఇంజనీరింగ్ పట్టాలను అందుకున్న విద్యార్థులు

కోవడంలో మరవకూడదని, అధ్యాపకులు తర్వాత తమ విజ్ఞానాన్ని తక్కువ అంచనా వేసుకోకుండా విజ్ఞానానికి పదును పెట్టి తమ బలాన్ని పెంచుకోవాలని సూచించారు. భారతీయులకు అపారమైన విజ్ఞానం ఉందని అందుకే టాప్ ఎమ్మెన్సీ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారని అందరూ వారిలాగే ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కళాశాలల ఛైర్మన్ డాక్టర్ అశోక్ రాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలపై కేసులు: డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకంటే కఠిన చర్యలు తీసుకుంటామని, నాన్ బెయిల్ బుల్ కేసులు నమోదు చేస్తామని డిఎస్‌పి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. గూడూరులోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఆయన సమావేశంలో పలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీ.ఎస్పీ సూర్యనారాయణ రెడ్డి మాటా డుతూ ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున డివిజన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. డివిజన్‌లో సమస్యాత్మక ప్రాంతాలను తాము గుర్తించా మని ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకు మొబైల్ పోలీసులు తిరుగుతుంటారన్నారు. ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ తరువాత రాజకీయ పార్టీల నాయకులు బాణాసంచా కాల్చడం , ర్యాలీలు చేపట్టడం నిషేధమని పేర్కొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు సమయం రోజు విజయోత్సవ ర్యాలీలు నిషేధిస్తున్నట్లు చంద్రగిరి డిఎస్పి శరత్ రాజ్ కుమార్ అన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందనుదనుకుంటున్న సమయంలో కొన్ని హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. అలాంటి సంఘటన వల్ల ఉన్న తాధికారులు పలు చర్యలను చేపట్టారని, ప్రతి గ్రామంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. సమస్యాత్మక గ్రామా లలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ పోలీస్ స్కీములు క్యూఆర్‌టి టీంలను నియమించామన్నారు. సంఘవిద్రోహ శక్తులపై కానీ, అనుమానిత వ్యక్తులపై గాని నిఘా ఉంచామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన యధాస్థితి ఏర్పడే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని దీన్ని గమనించి నియోజకవర్గం ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనింగ్ ఎస్పి దేవరాజ్, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్సై అనిత, కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: వచ్చే నెల ఎన్నికల లెక్కింపు కారణంగా సభలు, సమావేశాలు, విజయోత్సవాలకు అనుమతులు లేవని, శ్రీ సిటీ డిఎస్పి పైడేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శ్రీ సిటీ పరిధి గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని, ఇందుకు సంబంధించి డీఎస్పీ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ యాక్ట్ అమలులో ఉండటం వల్ల సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు ఎక్కడా నిర్వహించకూడదని ఆయన హెచ్చరించారు. శ్రీ సిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై ఇప్పటికే నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అందులో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ మొబైల్ పార్టీలు, క్యూఆర్‌టిటీంలు ఏర్పాటు చేశామని పుత్తూరు డిఎస్‌పి పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో వుంచుకుని గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా అల్లర్లకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేణిగుంట: రేణిగుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డిఎస్పి భవ్య కిషోర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4 అనంతరం విజయోత్సవ ర్యాలీలు సంబరాలు వంటి కార్యకలాపాలు కు పాల్పడితే చట్టారీత్యా నేరమని అటువంటి వాటికి పాల్పడితే ఎంతటి వారైనా కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను అందరి సహకారంతో ప్రశాంతంగా నిర్వహించుకున్నామని కౌంటింగ్‌కు కూడా అందరి సహకారం ఉండాలన్నారు.ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున్ ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: సమస్యాత్మక వార్డుల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసినట్లు తిరుపతి డిఎస్పి రవి మనోహర్ ఆచారి తెలిపారు. స్థానిక ఎస్వీయూ క్యాంపస్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ రౌడీ షీటర్స్ పై నిఘా పెంచాం, టపాసులు అమ్మడం, కొనడం నిషేధం, గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థి విజయోత్సవ ర్యాలీలు నిషేధం విధించామన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐ మురళీమోహన్, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

యమహా ఎఫ్‌జెడ్‌ఎస్ వెర్షన్ 4.ఓ సిరీస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని యమహా షోరూం నందు యమహా ఎఫ్ జెడ్ ఎస్ వెర్షన్ 4.ఓ సిరీస్ కలిగిన కొత్త వెర్షన్ టు వీలర్లను ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనసు కలిగిన యమహా సుబ్రహ్మణ్యం పట్టుదలతో స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగారని వారు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు .షోరూం అధినేత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ కొత్త వెర్షన్ బండ్లలో ఉన్న ప్రత్యేకతలను వివరించారు. ఫ్రీ హాండ్స్ తో మొబైల్ ని ఆపరేట్ చేయవచ్చని దాని ద్వారా యాక్సిడెంట్ ను నివారించవచ్చని తెలిపారు. టిసిఎస్ వల్ల యాంటీ స్కిడ్ సిస్టం ఉంటుందని తెలిపారు. కొను గోలు చేసిన కొను గోలుదా రులకు కూలర్‌ను బహు మతి గా అంది స్తా మని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు, షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.

యమహా న్యూవెర్షన్ ద్విచక్రవాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దొరవారిసత్రం మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని ఏకొల్లు గ్రామానికి చెందిన పునబాక నవీన్(18) అనే యువకుడు గురువారం రాత్రి పది గంటల పైన సూళ్లూరు పేట నుండి ఇంటికి వెళుతుండగా వెదురుపట్టు క్రాస్ రోడ్డు వద్ద ఓవాహనం వెనుక నుండి ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. ఇదే సమయంలో అధిక స్పీడ్‌తో వస్తున్న వాహనం అతని శరీరంపై దూసుకువెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శరీర భాగాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న దొరవారిసత్రం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద తీరును పరిశీలించారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట సామాజిక వైద్యశాల మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం యువకుడు మృతి దేహాన్ని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నవీన్ మృతి పట్ల తల్లిదండ్రులు, కుటుం బీకులు, స్నేహితులు శోకసముద్రంలో మునిగారు. ఎస్ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని పనపాకం గ్రామం వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్న వార్త గుప్పు మనడంతో చంద్రగిరి పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల అనంతరం హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం వాటిని నిలువరించడానికి పోలీసులు తలమునకలు అయిన ప్రస్తుత సమయంలో చంద్రగిరి మండలం పనపాకం ఆలయం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన స్థానికుల కంట పడింది. విషయాన్ని పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పనపాకంకు చేరుకుని ఆలయం చుట్టు పక్కల పరిశీలించారు. ఆలయం ముందు భాగంలో రక్తపు మరకలు ఉండటం వెనుక వరకు ఆ మరకలు కనపడటంతో ఆలయం ముందు ఆ వ్యక్తిని గుర్తుపట్టలేని విధంగా మొఖంపై బండ రాయితో కొట్టి హత్య చేసి ఉండవచ్చునని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని లాక్కొని వెళ్లి ఆలయం వెనకవైపు పడవేసి వుంటారని భావిస్తున్నారు. ఈ సంఘటన జరిగి రెండు రోజులు పైనే అవుతుం డడంతో మృతదేహం గుర్తు పట్టలేని విధంగా మారిపోయింది. సంఘటన స్థలాన్ని చంద్రగిరి డిఎస్పి శరత్ రాజ్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవరాజ్ , సిఐ రామయ్య, ఎస్ఐ అనిత పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంలను సంఘ టన స్థలానికి రప్పించి తనిఖీలు చేయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘట కు కారణాలు ఏమిటో? మృతుడు ఎక్కడి వాడో తెలియాల్సి వుందన్నారు.

రేణిగుంట: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన రేణిగుంట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట ఎస్టి కాలనీ వద్ద ఉన్న మల్లెమడుగు రిజర్వాయర్ వద్ద ఖాళీ రేకుల షెడ్లు లో శుక్రవారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తి సుమారు 3 5 నుండి 40 సంవత్సరాలు లోపు వయసుగల వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గుర్తించారు శరీరం బాగా కుళ్లిపోయి చర్మం పొడిగా మారి వ్యక్తిని మృతదేహం శరీరం ముఖం, కాళ్లు చేతులు మొ త్తం నలుపు రంగులో ఉన్నాయని గుర్తుపట్టలేనంతగా మారిందని తెలిపారు అనారోగ్యమా? లేక మద్యం ఎక్కువై నీళ్లు తాగక దప్పిక వల్ల మృతి చెందా డా? మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండొచ్చని సిఐ మల్లికార్జున్, ఎస్ఐలు తెలిపారు. గ్రామస్తులకు ఆ వ్యక్తి ఆ చూకీ ఎవరికైనా తెలిస్తే సెల్ నెంబర్ 94910 74540, 9440 796765 ,0877 2289 023కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

శ్రీకాళహస్తి: పట్టణానికి సమీపంలోని రామచంద్రాపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. సుమారు 60 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు వడదెబ్బ సోకి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని, పక్కనే సైకిలు కూడా ఉందని టూటౌన్ సీఐ రారాజు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా డాక్టర్ రోహిణమ్మ పుట్టిన రోజు వేడుకలు

డాక్టరు రోహిణమ్మను సన్మానిస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు పేదల పెన్నిధిగా సేవలం దిస్తున్న డాక్టర్ రోహిణమ్మ జన్మదిన వేడుకలను ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతరం శాలువా కప్పి పుష్ప గుచ్చాన్ని అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యం పట్ల ఎంత అంకిత భావంతో ఉంటారో అదే అంకిత భావంతో ఇన్నర్ వీల్ క్లబ్ , స్వచ్ఛంద సేవా సంస్థలకు తోడ్పాటు అందించడంలోనూ ముందుంటారని పేర్కొన్నారు. డాక్టర్ రోహిణమ్మ సేవలను, మానవతా దృక్పథాన్ని ఎన్నటికీ మరువలేమని కొని యాడారు. భవిష్యత్‌లో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు నిర్వహిం చు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వార్షిక వసంతోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మ వారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా శుక్రవారపు తోటకు వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, పలురకాల పండ్లరసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 గంటల నుండి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆ తరువాత మహాపూర్ణాహుతితో అమ్మవారి వసంతోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో జేఈఓ గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుభాష్ పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి -వాకాడు: హౌసింగ్ నిర్మాణాలపై ఎంపీడీవో వెంకటేశ్వర ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని సార్వత్రిక ఎన్నికల అనంతరం హౌసింగ్ నిర్మాణం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే ఆగి ఉన్న గ్రామీణ, జగనన్న లేఔట్‌లో గృహాలలో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి నుండే పక్కా గృహాలకు వివిధ దశలో వున్న వాటిని నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్రీయ సేవా సమితి మహిళా పొదుపు సంఘాల సభ్యులు వడమల పేట మండలం ఎస్ బి ఆర్ పురం గ్రామ సచివాలయం సమీపంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నోరు, గొంతు, గర్భాశయం ముఖ ద్వార సమస్యలు, బిపి, షుగర్, హెపటైటిస్ వంటి ఏడు రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ గత సంవత్సరం రోజులుగా రాస్ ద్వారా ప్రతినెల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, ప్రత్యేకంగా మహిళలకు దైనందిక జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యలకు గురి అవుతున్నారని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యాన్సర్ గురించి అవగాహన తీసుకోవాలన్నారు. నీ వాయిస్ శిబిరంలో సుమారు 150 మంది మహిళలు, పురుషులు పాల్గొని చికిత్స పొందారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నాగరాజు ఆదేశాల ప్రకారం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అమరావతి, రెడ్డి కుమారి, రూపేంద్ర, రాస్ అధికారులు రవి, ప్రకాష్, మీనా, ఏం ఎల్ హెచ్ పి ప్రియా, లీడర్లు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పాపానాయుడు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో రావిల్లవారికండ్రిగ గ్రామంలో కుష్టు, క్షయ వ్యాధులు, వడదెబ్బ, తదితర విషయాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన, నొప్పితో కూడిన నరాలు, బొడిపలు నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా ఉండడం మొదలైన లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా అభిమానించాలని వ్యాధి నిర్ధారణ కోసం దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కుష్టు వ్యాధిగా నిర్ధారణ అయితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా వ్యాసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందువల్ల ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట ఎండకు తిరగరాదని ఒకవేళ తిరగవలసి వస్తే టోపీ, గొడుగు తలపాగ వంటివి తలకు రక్షణగా ధరించాలని తెలిపారు. మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓ ఆర్ ఎస్ వంటి ద్రవాలు అధికంగా తీసుకోవాలని , ఈ కాలంలో దొరికే పుచ్చకాయ, దోసకాయ వంటి పండ్లు మెండుగా తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. పీహెచ్సీ హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, దక్కినప్పుడు గళ్ళలో రక్తం పడడం, చాతి నొప్పి మొదలైన లక్షణాలు క్షయ వ్యాధి లక్షణాలుగా భావించాలని, కళ్ల పరీక్ష ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ అవుతుందని తెలిపారు. డాట్స్ చికిత్సతో క్షయ వ్యాధి నయం వు తుంద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోహిత ప్రియ సిహెచ్ఓ(ఎమ్మెల్ హెచ్పి), సచివాలయం ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశా కార్య కర్తలు సుమతి, శాంతమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగరాజు